పేదల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

గిర్మాజీపేట : లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్

- పేదింట్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం
- దూరదృష్టితో ఆలోచిస్తున్న సీఎం కేసీఆర్
- తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- 781 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

గిర్మాజీపేట, అక్టోబర్ 7: పేదల సంక్షేమమే బీఆర్ఎస్ సర్కారు ప్రధాన ధ్యేయమని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. నగరంలోని రాజశ్రీ గార్డెన్‌లో నియోజకవర్గానికి చెందిన 737 మందికి కల్యాణలక్ష్మి, 44 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పేదింట్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కావొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ మేనమామగా మారి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో తనకు ఎదురైన ఒక ఘటన నుంచి పుట్టకొచ్చిందే ఈ సంక్షేమ కార్యక్రమం అని తెలిపారు. నిరుపేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లను సంతోషంగా జరుపుకోవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ఈ పథకాలకు రూపకల్పన చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, 33వ డివిజన్ కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా జరుపుకొందాం..

కరీమాబాద్: ఉర్సు రంగలీలా మైదానంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా జరుపుకొందామని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. దసరా ఉత్సవ సమితి సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్సవ ఆల్బమ్‌ను ఆయనకు అందజేసి, ఉత్సవాల నిర్వహణకు సహకరించాలని కోరారు. అనంతరం నన్నపునేని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేద్దామన్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్ల కోసం అధికారులతో సమీక్షిస్తానన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు నాగపురి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, ఉత్సవ కన్వీనర్ వడ్నాల నరేందర్, ట్రస్టు అధ్యక్షుడు వంగరి కోటేశ్వర్, సహాయ కోశాధికారి వెలిదె శివమూర్తి, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, పొగాకు సందీప్, దామెరకొండ వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శులు బజ్జూరి వాసు, నాగపురి మహేశ్, నరిగె శ్రీను, గట్టు గోవర్ధన్, నాగపురి సంతోష్, ఆర్గనైజర్లు పొగాకు చిరంజీవి, నాగపురి కాళి, వలుస వినయ్, పార్వతి కృష్ణంరాజు, బైరి వంశీ, యెలగందుల కృష్ణమూర్తి, జయ మహేశ్ పాల్గొన్నారు.

కోటలో రైతులకు పంట నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్

బీసీబంధు చెక్కుల అందజేత

ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీల అభివృద్ధి కోసం అందజేస్తున్న లక్ష రూపాయల బీసీబంధు చెక్కులను ఎమ్మెల్యే నరేందర్ 40వ డివిజన్‌లోని పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోశాల పద్మ, నాయకులు పోశాల స్వామి, బజ్జూరి రవి, కలకోట్ల రమేశ్, ఈదుల భిక్షపతి పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం చెక్కుల పంపిణీ

ఖిలావరంగల్: వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు ఖిలావరంగల్‌లో ఎమ్మెల్యే నరేందర్ పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు 24 గంటల ఉచిత కరెంటు వల్ల తెలంగాణ సస్యశ్యామలంగా మారిందని ఎమ్మెల్యే అన్నారు. 61 మందికి చక్కులు పంపిణీ చేశామని, మిగితా వారికి ఆదివారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కరీమాబాద్: చీరెలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పల్లం పద్మ

ఆడబిడ్డలకు బతుకమ్మ చీరెల పంపిణీ

కరీమాబాద్/నర్సంపేటరూరల్, అక్టోబర్ 7: వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటలో 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ శనివారం మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డలు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చీరెలు అందిస్తున్నదన్నారు. గత ప్రభుత్వాలు పండుగలకు ఏనాడూ ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత తెలంగాణలో సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జీడబ్ల్యూఎంసీ సిబ్బంది పాల్గొన్నారు. ముత్యాలమ్మతండా జీపీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ భూక్యా సైద మహిళలకు చీరెలు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి, వార్డు సభ్యులు నీల, భీమ్లా, పద్మ, జ్యోతి, ఈరు, శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నునావత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 7: వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు శనివారం రాత్రి విస్తృత తనిఖీలు చేపట్టారు. మట్టెవాడ, ఎంజీఎం సెంటర్, కాశీబుగ్గ, ఏడు మోరీలు తదితర ప్రాంతాల్లో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పందంగా ఉన్న వారిని ప్రశ్నిస్తూ.. పూర్తి వివరాలను ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తెలుసుకున్నారు. వాహనాల్లో ఉన్న వస్తువులు, బ్యాగులు తదితరాలను నిశితంగా పరిశీలించారు. అలాగే, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను కూడా తనిఖీ చేసి ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా వారి వివరాలపై ఆరా తీశారు. తనిఖీల్లో మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు, ఇంతెజార్‌గంజ్ సీఐ శ్రీనివాస్, సీసీఎస్ సీఐ శంకర్, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

కోటను సందర్శించిన 'వరల్డ్ హెరిటేజ్ వలంటీర్లు'

ఖిలావరంగల్/వెంకటాపూర్, అక్టోబర్ 7 : వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా 16 రాష్ట్రాలకు చెందిన 40 మంది విద్యార్థులు శనివారం ఓరుగల్లు కోటను సందర్శించారు. కాకతీయులు చరిత్ర, కట్టడాల నిర్మాణాల శైలిని ట్రైనింగ్ విద్యార్థులకు అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ వివరించారు. రాతి, మట్టికోట నిర్మాణాలు, ద్వారాలు, బావులు, ఖుష్‌మహల్ తదితర కట్టడాలను వారు వీక్షించారు. కాగా, తొలుత వలంటీర్లకు రామప్పలోని పాత గెస్ట్ హౌస్ ఆవరణలో యోగా గురువు రాంబాబు రెండు గంటల పాటు శిక్షణ ఇచ్చారు. జీవీఎస్ సూర్యనారాయణ మూర్తి కాకతీయ కల్చరల్ లాండ్‌స్కేప్ అండ్ ఆర్కిటెక్చర్‌పై వివరించారు. కాంపెయిన్‌లో భాగంగా వరంగల్ కోట, వేయిస్థంబాల గుడిలను సందర్శించగా వాటి ప్రాముఖ్యత ఇంజనీరింగ్ టెక్నాలజీ, కళ్యాణ మండపం పునర్నిర్మాణంలో తీసుకుంటున్న చర్యల గురించి పాండురంగ రావు వివరించారు. యోగా మాస్టర్ శ్రీనివాస్, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, కేయూ స్కాలర్ కొక్కుల ప్రశాంత్, ట్రస్టు సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖిలావరంగల్ : కోటలోని కీర్తి తోరణాల మధ్య ఫొటోలు దిగుతున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్లు

ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నిరుపేదలకు వైద్యసేవలు అభినందనీయం

కాశీబుగ్గ, అక్టోబర్ 7: నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని పాస్టర్ పెరుమాండ్ల ప్రవీణ్ అన్నారు. లేబర్‌కాలనీలోని సీబీసీ చర్చిలో శనివారం వరంగల్ క్రిస్టియన్ సొసైటీ చైర్మన్ సరిగొమ్ముల దీన్‌దయాళ్ ఆధ్వర్యంలో ప్రకాశం, సుగుణమ్మ జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీ, ఆర్థో, స్త్రీల సమస్యలు, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నిశాంత్‌కుమార్, ప్రీతిదయాళ్, కోనసాక వెంకటస్వామి, అజిత్ మహ్మద్, సరిగొమ్ముల సామ్యేల్, సుష్మిత, సొసైటీ గౌరవాధ్యక్షుడు బాబ్జి, ప్రెసిడెంట్ గంధం అరుణ్‌జేమ్స్, వైస్ చైర్మన్ ఎంఎస్ రాజు, ట్రెజరర్ బ్రిమెల్‌పాల్, మహిందర్‌పాల్, వినయ్, సూర్యజడ్సన్, గుండేటి శ్యామ్‌కుమార్, కమలాకర్, కార్తీక్, మథ్యూస్, ప్రాన్సిస్ జాషువా, శ్యామ్‌సన్, ఏలియా పాల్గొన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠకు ఏర్పాట్లు

కరీమాబాద్, అక్టోబర్ 7: గ్రామ అభివృద్ధి కోసం, ప్రజల క్షేమం కోసం కరీమాబాద్‌లో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనోత్సవాన్ని 2024 ఫిబ్రవరి 11 నుంచి నాలుగు రోజులపాటు చేపట్టాలని నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు పలుమార్లు సమావేశాలు నిర్వహించామన్నారు. వివిధ కారణాల వల్ల వాయిదా వేశామన్నారు. వేదపండితులు, దేశగురువు సూచనల మేరకు వచ్చే ఫిబ్రవరిలో బొడ్రాయి పునఃప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఉత్సవాలకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

14 నుంచి శరన్నవరాత్రోత్సవాలు

శారదామాత

పోచమ్మమైదాన్, అక్టోబర్ 7: వరంగల్ శ్రీనివాసకాలనీలోని శృంగేరి శంకర మఠంలో ఈ నెల 14 నుంచి అక్టోబర్ 24 వరకు శ్రీశారదా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. జగద్గురువు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీస్వామి ఆశీస్సులతో నిత్యపూజ, హోమం, సాహితి, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా 14న ఉదయం 5 నుంచి 9 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, శారదాంబ అమ్మవారికి పంచ సూక్తాలతో సకల నదీ జలాలతో మహాభిషేకం, అమ్మవారిని పసుపు అలంకారంలో హరిద్రా దర్శనం, మధ్యాహ్నం జగత్ ప్రసూతికా అలంకారం, మహా మంగళహారతి, 15న ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అమ్మవారికి విశేష పూజ, సంకల్పం, చంద్రమౌళీశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సప్తశతి పారాయణం, 10 గంటల నుంచి శారదాంబ కల్పోక్త విశేష పూజ, మధ్యాహ్నం సామూహిక లలితా సహస్ర నామ పారాయణం, సాయంత్రం అష్టోత్తర సహస్రనామార్చనలు, 16న రాత్రి 8 గంటల నుంచి సీహెచ్ కృష్ణవేణితో కర్ణాటక సంగీత కచేరి, 17న రాత్రి 8 గంటల నుంచి గజ్జెల రంజిత్‌కుమార్ శిష్య బృందంతో పేరిణి నృత్య ప్రదర్శన, 18న రాత్రి 8 గంటల నుంచి వెలిదే నరసింహమూర్తి భాగవతర్‌తో భూకైలాసం హరికథామృతం, వెలిదే భార్గవ శర్మతో గాత్ర సంగీతం, 19న రాత్రి 8 గంటల నుంచి తోరణాల పద్మజ శిష్య బృందం ఆధ్వర్యంలో భక్తి సంగీతం, 20న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరస్వతీ ఆవాహనం, సరస్వతీ పూజ, రాత్రి 8 గంటలకు హరి విజయశ్రీతో వీణా వాయిద్య కచేరి, 21న రాత్రి 8 గంటలకు సుందర్ సత్సంగ్ వరంగల్ వారితో భజన కార్యక్రమం, 22న రాత్రి 8 గంటలకు నటరాజ నృత్య కళాశాల వారితో కూచిపూడి నృత్య ప్రదర్శన, 23న సాయంత్రం 7 గంటలకు శ్రీనివాసకాలనీ పురవీధిలో పల్లకీసేవ, 24న ఉదయం 11 గంటలకు విజయదశమి సందర్భంగా శమీపూజ ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకుడు సంగమేశ్వర జోషి తెలిపారు. 11 రోజులపాటు జరుగనున్న పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఇతర వివరాలకు 9989139461 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కార్పొరేటర్ కుమారస్వామికి అభినందనల వెల్లువ

పోచమ్మమైదాన్, అక్టోబర్ 7: బీఆర్ఎస్‌లో చేరిన 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామికి శనివారం పలువురు అభినందనలు తెలిపారు. పోచమ్మమైదాన్‌లోని ఆయన ఇంటికి పలువురు నాయకులు, కార్యకర్తలు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ కార్పొరేటర్ యెలుగం శ్రీనివాస్, స్థానిక నాయకుడు చెన్నబోయిన రవీందర్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే నరేందర్ సహకారంతో డివిజన్‌ను అభివృద్ధి చేయాలని ఆయనను కోరారు.